

డీన్‌గా ఆచార్య పి.రమాదేవి

కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో ఆచార్యులు పి.రమాదేవిని డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్‌గా వైస్‌ఛాన్సలర్ ఆదేశాలమేరకు నియమించినట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆచార్య పి.రమాదేవి తెలుగుశాఖ పాఠ్యప్రణాళికా సంఘం అధ్యక్షురాలుగా, తెలుగుశాఖాధ్యక్షులుగా, డిప్యూటీ వార్డెన్‌గా, ఉమెన్స్ సెల్ సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వహించారని పేర్కొన్నారు. సుదీర్ఘ బోధనానుభవం కలిగిన రమాదేవి వివిధ విశ్వవిద్యాలయాల పాఠ్య ప్రణాళికా సంఘం సభ్యులుగా పనిచేశారని తెలిపారు. వివిధ అంతర్జాతీయ, జాతీయ సదస్సుల్లో పాల్గొని పరిశోధన పత్రాలు సమర్పించారని పేర్కొన్నారు. ఆమె నియామకం పట్ల వి సి ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, విశ్వవిద్యాలయ బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు రమాదేవికి అభినందనలు తెలిపారు.



మైదుకూరులో కోలాటం ఆడుతున్న అంగన్వాడీలు

వేతనాలు పెంచే వరకూ సమ్మె ఆగదు

- కొలాటం ఆడుతూ.. ఒంటికాలిపై నిల్చుని అంగన్వాడీల నిరసన
- 21వ రోజూ కొనసాగిన సమ్మె
- టిడిపి, ప్రజా సంఘాల నుంచి పెరుగుతున్న మద్దతు

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ కడప జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం నాటికి 21వ రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాపితంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ప్రభుత్వంపై వ్యతిరేకతను ప్రదర్శిస్తూ నిరసన తెలియజేశారు. మరికొన్ని చోట్ల ఒంటికాలిపై, మోకాళ్లపై నిల్చుని ఆందోళన చేపట్టారు. బద్వేల్‌లో టిడిపి మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మద్దతు తెలిపి సమ్మెలో పాల్గొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్వాడీలు మాత్రం సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మె విరమించేది లేదంటూ నినాదాలు చేశారు.

కమలాపురం (వల్లూరు) : అంగన్వాడీల జీతాల పెంచే వరకూ అంగన్వాడీల సమ్మెకు కొనసాగుతుందని, సిపిఎం మద్దతు ఉంటుందని సిపిఎం కడప జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ అన్నారు. సోమవారం కమలాపురం ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్ప్ లైన్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మెకు మద్దతుగా సిఐటియు మాజీ జిల్లా కార్యదర్శి రామ్మోహన్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి చంద్ర, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్ప్ లైన్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఆర్.లక్ష్మీదేవి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 29 రాష్ట్రాల్లో దేశంలోని నూటికి 48 శాతం ఉన్న మహిళల్లోని గ్రామీణ పేద మహిళల్లో బాలింతల్లో పిల్లల్లో విద్య వైద్యం సేవలందిస్తున్న ఏకైక రంగం అంగన్వాడీ రంగమన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారి బడ్జెట్లో ఐదు శాతం నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. నిజమైన దేశభక్తితో పనిచేస్తున్న ఏకైక ప్రభుత్వ రంగ సంస్థ ఐసిడిఎస్ అని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ కమలాపురం ప్రాజెక్టు నాయకులు విజయ, మల్లేశ్వరి, ప్రభావతి, రేవతి, రాజకుమారి, జ్యోతి ,లక్ష్మీదేవి, చంద్రకళ అధిక సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు. **చాపాడు :** అంగన్వాడీ కార్యకర్తలు సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తల మండల నాయకురాలు సుజాత మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తల పట్ల చిన్నచూపు చూస్తుందన్నారు. న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని సామరస్యంగా నిరసన తెలియజేస్తున్న ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, హెల్ఫర్‌లు పాల్గొన్నారు. **బద్వేలు :** అంగన్వాడీ వర్కర్లు, మినీ అంగన్వాడీలు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని సోమవారం స్థానిక సమగ్ర శిశు అభివృద్ధి అధికారి (సిడిపిఒ) కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ (సిఐటియు) బద్వేల్ ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలియజేశారు. 21 రోజు సమ్మెకు తెలుగుదేశం మహిళ విభాగ రాష్ట్ర ఉపా ధ్యక్షురాలు ఝాన్సీ, మున్సిపాలిటీ నాయ కురాలు ఆదిలక్ష్మి,13వ వార్డు టిడిపి కౌన్సిలర్ షేక్ మహమ్మద్ హసన్,34వ వార్డు కౌన్సిలర్, టిడిపి మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ మిత్తి కాయల సునీత పాల్గొని తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా వారు సంయుక్తంగా మాట్లాడుతూ ఇప్పటికే రెండుసార్లు మం త్రులు అంగన్వాడీల సమస్యలపై చర్చించి కూడా ముఖ్యమంత్రితో ఇంతవరకు మాట్లాడలేదంటూ కాలయాపన చేస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని మహిళల ఆగ్రహానికి గురికావద్దని హితవు పలికారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం గోపవరం మండల నాయకులు పొదిలి కదిరయ్య, ఐద్వా మహిళా సంఘం పట్టణ అధ్యక్షురాలు గంప అనంతమ్మ, నాయకురాలు మోక్షమ్మ, బాలమ్మ, నాగమ్మ, సిఐటియు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, నాయకులు రాజగోపాల్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చిన్ని, పట్టణ అధ్యక్షుడు ఎస్.ఎం షరీఫ్, నాయకులు సురేంద్ర, పెద్ద ఎత్తున అంగన్వాడీ వర్కర్లు, మినీ అంగన్వాడీలు, హెల్పర్లు పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో 21వ రోజు ఆటాడుకుందాం ...రా అంటూ ఆటాపాట పాడుతూ అంగన్వాడీలు నిరసన సమ్మె కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ టియు జిల్లా ఉపాధ్యక్షులు యన్ భైరవ ప్రసాద్ మాట్లాడుతూ జీతం కోసం అంగ న్వాడీలు 21 రోజులుగా సమ్మె చేస్తూ ఉన్న జనవరి ఫస్ట్ రోజు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఏ విధంగా సంబరాలు చేసుకుంటారని ప్రశ్నించారు. అంగన్వాడీ టీచర్లను కొత్త సంవత్సరం నడిరోడ్లలో ఉంచడం చాలా బాధాకరమైన విషయం అన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండలనాయకుడు బొజ్జా.గుర్రయ్య, పోరుమామిళ్ల ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు దస్తగిరిమ్మ, జ్యోతిమ్మ, లీలావతి, స్వాతి, రేణుక, రమాదేవి, శ్రీదేవి, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్వాడీల నిరవధిక సమ్మె సోమవారానికి 21వ రోజుకు చేరుకుంది. సమ్మెకు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి అన్వేష్, సంపూర్ణ నిరస నకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు, ఎఐటియుసి అంగన్వాడీ వర్కర్స్ నాయకులుఉమాదేవి, కుసు మావతి, పార్వతి, పద్మావతి, భారతి, రజిని, శుభలక్ష్మమ్మ, లక్ష్మీ కళావతి, తులసి పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ చేస్తున్న సమ్మె 21 రోజులకు చేరుకుంది. సమ్మెకు మద్దతుగా సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులు రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీల సమస్యల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తుందని ఈ పరిస్థితి కొనసాగితే ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవని అన్నారు. జనవరి మూడో తారీకున రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన కొనసాగుతుదన్నారు. కడప జిల్లాలో అంగన్వాడీలు పెద్ద ఎత్తున తరలిరావాలని అన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర నాయకులు మంజుల, సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, సిఐటియు కార్యదర్శి విజయ్ కుమార్, అంగన్వాడీ యునియన్ కార్యదర్శి సుబ్బలక్ష్మి, విజయ, నాగలక్ష్మి, రాజీ, పద్మ, శివమ్మ, గురుదేవి, అంగన్వాడీలు పాల్గొన్నారు.



కమలాపురంలో ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు



పోరుమామిళ్ల : మోకాళ్లపై నిల్చుని నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు



బద్వేల్ : అంగన్వాడీలకు మద్దతు తెల్పుతున్న టిడిపి మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షులు

తగ్గిన సందడి

- పడిపోయిన విక్రయాలు
- వర్షాభావ ప్రభావంతో రైతులు విలవిల
- సాంస్కృతిక ప్రదర్శనలు కరువు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

నూతన సంవత్సర వేడుకల సందడి గణనీయంగా తగ్గింది. ఈ ఏడాది ఖరీఫ్, రబీలపై కొనసాగుతున్న వర్షాభావం ప్రభావం స్పష్టంగా కనిపించింది. ప్రతిఏటా నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కోట్లాది రూపాయల వ్యాపార లావాదేవీలు సాగేవి. ప్రస్తుతం నూతన సంవత్సరాన్ని పరిశీలిస్తే సుమారు 50 శాతం వరకు క్రయవిక్రయాలు పడిపోయినట్లు కనిపిస్తోంది. తీవ్ర వర్షాభావం పరిస్థితుల కారణంగా పూర్తిస్థాయిలో విత్తనం పడని పరిస్థితి. మరోవైపు అరకొర సాగు చేసిన శనగ మొలకెత్తడం సందేహంగా మారింది. పత్తి, పసుపు ధరలు అమాంతం పడిపోవడం, వర్షాభావం విజృంభణ వంటి కారణాలతో కొనుగోలు శక్తి సన్నగిల్లి నట్లు కనిపిస్తోంది. కరోనా విజృంభణకు ముందు హైదరాబాద్, తిరుపతి నుంచి కళాకారులతో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించడంతో జోష్ కనిపించేది.

జిల్లాలో నూతన సంవత్సర శోభ కనిపించలేదు. జిల్లాలోని ప్రధాన కేంద్రాల్లో కేకుల విక్రయాలు మొదలుకుని వైన్స్, విందులు, వినోదాల సందడి కనిపించేది. కేకులు, పూలు, పూల బొకేల వ్యాపారాల సందడి కనిపించేది. ఈ ఏడాది నూతన సంవత్సర వేడుకల సందర్భంగా సాగిన వ్యాపారాల తీరును పరిశీలిస్తే మూడేళ్ల కింద నూతన సంవత్సరం సందర్భంగా కడపలో ఒక్కో వ్యాపారికి పూలు, బొకేలన్నీ కలిపి సుమారు రూ.లక్షలాది వ్యాపారం సాగడం తెలిసిందే. ఈఏడాది రూ.50 వేల దిగువకు పడిపోయిందని వ్యాపారులు వాపోతున్నారు. వస్త్ర దుకాణాల్లో సందడి సైతం అంతంత మాత్రమే కనిపించింది. కడప నగర కూడళ్లలోనూ గుడారాలు వేసి నూతన సంవత్సర కేకులు, బొకేలు విక్రయించడం తెలిసిందే. ఈఏడాది నూతన సంవత్సర కేకుల, బొకేలు గుడారాలు తక్కువగానే కనిపించకపోవడం గమనార్హం. జిల్లాలో తీవ్ర వర్షాభావం కొనసాగుతుండడం కారణమని తెలుస్తోంది. సాధారణ పంటలతోపాటు ఉద్యాన రైతులూ భారీగా నష్టపోవడం తెలిసిందే. ఫలితంగానే నూతన సంవత్సర శోభ తగ్గింది. తాజాగా కరోనా వేరియంట్ విస్తరి స్తోందనే భయంతో రక్షణాత్మక వాతావరణమూ కనిపించింది. వస్త్ర వ్యాపారం, మద్యం వ్యాపారం మినహా మిగిలిన వ్యాపార కార్యకలాపాలు పరిమితంగానే సాగినట్లు కనిపిస్తోంది. జిల్లాలోని యువత కేరింతలు కొడుతూ బైక్‌లపై రయ్‌మని వెళ్తున్న ప్రమాదకర విన్యాసాలను పోలీసులు తనిఖీల పేరుతో కట్టడి చేయడం ఉపశమనాన్ని కలిగించింది. 2023 సంవత్సరానికి టాటా చెప్పి నూతన సంవత్సరాన్ని స్వాగతించిన నేపథ్యంలో నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకునే వరకు పరిమితం కావడం గమనార్హం.

తగ్గిన విక్రయం

ఏటా నూతన సంవత్సర వేడుకల సందర్భంగా సుమారు రూ.మూడు కోట్ల నుంచి రూ.ఐదు కోట్ల మేరకు విక్రయాలు సాగేవని అంచనా. కరోనా విజృంభణ దగ్గర నుంచి వ్యాపారానికి గండి పడింది. సుమారు 50 శాతం మేరకు విక్రయాలు తగ్గుముఖం పట్టినట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రంలోని నాగరాజుపేట, మురళీ థియేటర్, అప్సర థియేటర్ ప్రాంతాల్లోని రహదారులను ఆనుకుని తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసి భారీగా విక్రయాలు నిర్వహించేవారు. ప్రస్తుతం కడపకెఫే, పద్మావతి, మయూర, పుష్పగిరి సర్కిల్, వైవిస్ట్రీట్ వంటి ప్రాంతాల్లోనూ దుకాణాలు నిర్వహించని పరిస్థితిని అర్థం చేసుకోవాలి.

సాంస్కృతిక ప్రదర్శనలు నిల్

జిల్లాలో సాంస్కృతిక ప్రదర్శనలు జాడే లేదు. 2018లో కడప, ప్రొద్దుటూరు పట్టణాల్లో హైదరాబాద్‌కు జబర్దస్త్, శిల్పారామంలో కళాకారులు తమ విన్యాసాలతో అలరించడం తెలిసిందే. నాలుగేళ్లుగా అటు వంటి సాంస్కృతిక విన్యాసాల ఛాయలు కనిపించకపోవడం గమనార్హం. ఏదేమైనా నాలుగేళ్లుగా కొనసాగుతున్న కరోనా, తుఫాన్, తాజాగా వర్షాభావ పరిస్థితుల ధాటికి నూతన సంవత్సర సందడి నామమాత్రంగా మారిందని చెప్పడంలో సందేహం లేదు.

చెప్పులు కుడుతూ మున్సిపల్ కార్మికుల ఆందోళన

7వ రోజూ కొనసాగిన సమ్మె

కడప అర్బన్ : సిఎం జగన్మోహన్ రెడ్డికి కళ్ళు తెరిపించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం మున్సిపల్ కార్మికుల సమ్మె 7వ రోజుకు చేరుకుంది. కార్పొరేషన్ ఎదుట ఉన్న గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. గాంధీ విగ్రహానికి మున్సిపల్ కార్మికులు నీళ్లతో కడిగి పులిదండ వేశారు. ఈ సందర్భంగా ఆదాము మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి నాలుగున్నరేళ్లవుతున్నా జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీ సాక్షి ఇచ్చిన హామీని అమలు చేయడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది అందరినీ పర్మినెంట్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పని సమాన వేతనం ఇవ్వాలని ఇంజినీరింగ్ సెక్షన్లో పనిచేస్తున్న కార్మికులకు స్కిల్డ్, సెమి స్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని కోరారు. క్లాప్ డ్రైవర్లకు కనీస వేతనం రూ.18,500 ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సుంకర రవి, కంచుపాటి తిరుపాల్, గోపి, సుంకర కిరణ్, పి.సి.సుబ్బయ్య, అజీముద్దీన్, రాముడు, సుంకన్న, నాగయ్య, నాగరాజు , కార్మికులు పాల్గొన్నారు. **బద్వేలు :** కార్మికులకు జగనన్న ఇచ్చిన హామీలు అమలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మె 7రోజులో భాగంగా బద్వేల్ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ మున్సిపల్ కార్యాలయం వద్ద చెప్పులు కుడుతూ తమ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి కె.శ్రీనన్న మాట్లాడుతూ ఆనాడు మున్సిపల్ కార్మికులను పొగడ్తలతో ముంచేత్తిన పాలకులు నేడు వారిపై దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటని వాపోయారు. పారిశుధ్య కార్మికులకు లక్ష రూపాయలు జీతం ఇచ్చిన తక్కువేనని మాట్లాడిన జగన్మోహన్ రెడ్డి నేడు వేతనాల పెంపుపై పెదవి విరచడం శోచనీయమని వాపోయారు. 2023 వ సంవత్సరం కార్మిక ప్రజా ఉద్యమాలతో ముగిస్తుందని, 2024వ సంవత్సరం కార్మిక నిరసనలతో ప్రారంభమవుతుందని, కనీసం కొత్త సంవత్సరంలోనైనా ప్రభుత్వం కార్మికుల సమ్మెకు ముగింపు పలికి కోర్కెలు అంగీకరించాలని లేనియెడల ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యులు గౌతమి, పట్టణ అధ్యక్షురాలు అనంతమ్మ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని, వడ్డెర వృత్తిదారుల సంఘం పట్టణ నాయకులు గంప సుబ్బరాయుడు, సిఐటియు పట్టణ నాయకులు రాజగోపాల్, యూనియన్ పట్టణ అధ్యక్షులు పులి శ్యాం ప్రవీణ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు దియ్యాల హరి, ఉపాధ్యక్షులు దియ్యాల దేవమ్మ, గంటా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి దియ్యాల నాగేంద్రబాబు, కార్యదర్శులు నాగరపు సత్యరాజు, బద్వేల్ ప్రవీణ్ కుమార్, నేలటూరు పాలయ్య, కోశాధికారి కాలువ శివకుమార్ కమిటీ సభ్యులు పద్మిశెట్టి రామయ్య, ఇండ్ల చంద్రశేఖర్, తేళ్ల కిరణ్ పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** తమ న్యాయమైన కోర్కెలు సాధించుకునేంత వరకు పోరాటం ఆపమని మున్సిపల్ కార్మికుల స్పష్టం చేశారు. అపరిష్కృత కోర్కెల పరిష్కారం కోరుతూ మున్సిపల్ కార్మికుల సంఘం (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె సోమవారానికి ఏడవ రోజుకు చేరుకుంది. నూతన సంవత్సర పండుగపూట ధర్నా ప్రదేశంలోనే కేక్‌కట్ చేసి అక్కడే బోజనాలు చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘ గౌర వాధ్యక్షులు సత్యనారాయణ, కార్యదర్శి సాల్మన్, సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, ధర్నా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు చంటి కోశాధికారి రాఘవేంద్ర కార్మికులు పాల్గొన్నారు.



బద్వేల్‌లో చెప్పులు కుడుతూ నిరసన తెలియజేస్తున్న మున్సిపల్ కార్మికులు



కడప గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న కార్మికులు

వారసత్వ రక్షణే ధ్యేయం

నంది అవార్డు గ్రహీతలకు సత్కారం



అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న సంస్థల ప్రతినిధులు

ప్రజాశక్తి - కడప అర్బన్

తమ సంస్థలు ఉమ్మడిగా సేవా సంస్కృతి వారసత్వ సంపదలను రక్షించడమే ద్యేయంగా ముందుకు సాగుతున్నాయని, అందులో భాగంగా జిల్లాకు నంది అవార్డులు సాధించి పెట్టిన కళాకారులను ప్రత్యేకంగా అభినందిస్తున్నామని పలువురు కళాభిమానులైన వక్తలు పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి నంది నాటక పోటీల్లో జిల్లాకు చెందిన వైవీయూ పాలక మండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, సీనియర్ నాటక దర్శకులు పల్లేటి లక్ష్మీకులశేఖర్‌ను సోమవారం ఘనంగా సత్కరించారు. ఇంటాక్, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు ఆధ్వర్యంలో ఉమ్మడిగా స్థానిక మానస ఇన్ సమావేశ మందిరంలో అవార్డు గ్రహీతలకు సత్కార కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ మానస కె. చిన్నపరెడ్డి మాట్లాడుతూ పర్యాటకపరంగా గండికోటలో అంతర్జాతీయ ఒబెరాయ్ హోటల్ ఏర్పాటుకు రంగం సిద్ధం కావడం, ఇంటాక్ కార్యక్రమంలో భాగంగా పాతకలెక్టరేట్‌కు మరమ్మతులు, లయన్స్ క్లబ్ పరంగా వంద దాటిన సేవా కార్యక్రమాలు తమకు గర్వకారణంగా నిలుస్తున్నాయన్నారు. ఇటీవల వారసత్వ కళల రక్షణ కోసం సీనియర్ నాటక సంస్థ సవేరా నిర్వహణ బాధ్యతను కూడా తీసుకున్నామని, ప్రారంభ దశలోనే తమ సభ్యులకు రెండు నంది అవార్డులు రావడం జిల్లాకే గర్వకారణమన్నారు. జిల్లాతోపాటు తమ సంస్థలు నూతన సంవత్సరంలో అభివృద్ధి పథంలో నడుస్తాయని, మరింత పేరు తెచ్చుకునేందుకు కృషి చేస్తామన్నారు. అవార్డు గ్రహీతల్లో ఒకరైన మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ నంది అవార్డు కంటే వైఎస్సార్ పేరిట జిల్లా రచయిత సంఘాన్ని ఏర్పాటు చేసి మూడు నెలల్లోనే మహాసభలను విజయవంతంగా నిర్వహించడం మరువలేని జ్ఞాపకంగా నిలుస్తుందన్నారు. పల్లేటి లక్ష్మీకులశేఖర్ మాట్లాడుతూ నాటక రంగం తనకు తల్లిలాంటిదని, తన ఉన్నతికి కారణమైన సవేరా సంస్థను మరిచి పోలేమని, చిన్నపరెడ్డి పర్యవేక్షణలో వంద నందులు సాధించగలమన్న విశ్వాసం ఉందన్నారు. డాక్టర్ పుత్తా బాలిరెడ్డి మాట్లాడుతూ సవేరా లాంటి సంస్థ నిర్వహణ బాధ్యత తీసుకోవడం జిల్లా నాటక రంగానికి ఆయువు పోసినట్లైందన్నారు. మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, ఇంటాక్ పూర్వ కన్వీనర్ ఎలియాస్‌రెడ్డి, డాక్టర్ తవ్వా వెంకటయ్య, రెడ్డిశేఖర్‌రెడ్డి, కొండూరు జనార్దన రాజు కార్యదర్శి నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలతోపాటు రెడ్డిశేఖర్‌రెడ్డిని కూడా సత్కరించారు. కార్యక్రమంలో బాలగొండ గంగాధర్, గునిశెట్టి శ్రీనివాసులు, పద్మప్రియ చంద్రారెడ్డి, కొండారెడ్డి, రాఘవేంద్రవర్మ, రమణారెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌టియు జిల్లా అధ్యక్షులుగా ఇలియాస్ బాషా

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎస్‌టియు జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కడప టిటిడి కల్యాణ మండపంలో 77వ జిల్లా కౌన్సిల్ సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సి.పురుషోతాం వ్యవహరించారు. అధ్యక్షులుగా ఎస్ఎండి ఇలియాస్ బాషా, ప్రధానకార్యదర్శిగా నర్రెడ్డి సంగమేశ్వర రెడ్డి, ఆర్థిక కార్యదర్శి గా జి. రామమోహన్, రాష్ట్ర కౌన్సిలర్లుగా ముల్లు రఘునాథరెడ్డి, కె.సురేష్ బాబు, కె. బాలగంగి రెడ్డి, ఆర్.గురుకుమార్, ఎస్. దాదాపీర్, పి.రమణారెడ్డి, బి.సుధాకర్ రెడ్డి, ఎ .వి.సుధాకర్ రెడ్డి, ఎన్ఎన్‌జి శంకర్ రెడ్డి, పి.రషీద ఖాన్, కె.శీను, జి.సంజీవరెడ్డి, యు.సుబ్రమణ్యం, జిసి హెచ్‌రెడ్డి, ఎం.రామక్రిష్ణా రెడ్డి, సి.రామచంద్రా రెడ్డి, పి.వి. క్రిష్ణారెడ్డి, హెచ్. రవికేశవరావు, కె.భాస్కర్, శివారెడ్డి, పాలకొండయ్య, రవిశంకర్ రెడ్డి, చెన్నకేశరెడ్డి, వెంకటసుబ్బయ్య, చంద్రహాస రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులుగా ప్రతాప్ రెడ్డి, పుల్లారెడ్డి, మహబూబ్ బాషా, పద్మాకర ,పెంచలయ్య, శేఖరబాబు,మల్లేశ్వర రెడ్డి, ఉపాధ్యక్షులుగా భాస్కర్ రెడ్డి, సుబ్రమణ్యం, నరసింహా రెడ్డి,శివరామిరెడ్డి, ధర్మారెడ్డి, సురేష్, ఓబన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



ఇలియాస్‌బాషా



సంగమేశ్వరరెడ్డి

ఎల్ఐసి ఏజెంట్లు అభినందనీయులు

ప్రజాశక్తి- కడప అర్బన్

ఎల్ఐసి కడప బ్రాంచ్ పరిధిలో ఏడుగురు ఏజెంట్లు ఎండిఆర్‌టి (మిలియన్ డాలర్ రౌండ్ టేబుల్) స్థాయిలో బీమా వ్యాపారం చేయడం అభినందనీయమని బ్రాంచ్ మేనేజర్ వెంకటకృష్ణ అన్నారు. 2023, జనవరి 1 నుంచి డిసెంబర్ 31 లోగా రూ.35 లక్షల కంటే ఎక్కువగా ప్రీమియం సేకరించి ఎండిఆర్‌టి స్థాయికి చేరుకున్న బి.మునెయ్య, జిఎల్ నరసింహులు, యస్.ఇస్మాయిల్, జి.కృష్ణమూర్తి, ఎన్.ఏ.రవూఫ్, ఆర్.నిత్యానంద రెడ్డి, డి.కాశిం హుస్సేన్ కు స్థానిక బ్రాంచ్ కార్యాలయ సభాభవనంలో జరిగిన సన్మాన సభ నిర్వహించారు. విజేతలను సంస్థ తరపున ఘనంగా సన్మానించారు. వీరంతా అమెరికా లేదా కెనడా దేశాలలో జూన్‌లో నిర్వహించే అంతర్జాతీయ ఆర్థిక రంగ ప్రొఫెషనల్స్ సమావేశాల్లో పాల్గొంటారని అన్నారు. సన్మాన కార్యక్రమంలో అధికారులు చలమారెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, విజయ మోహన్ రెడ్డి, లియాఫీ కడప అధ్యక్షుడు నిత్యానంద రెడ్డి, యూనియన్ల నాయకులు సంజయ్, అమర్నాథ్ బాబు, అవధానం శ్రీనివాస్, అక్బర్ బాషా, హబీబుల్లా ఖాన్, రాజు, కుమార్ పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు నాణ్యమైన పరిష్కారం : డిఆర్‌ఒ

ప్రజాశక్తి - కడప

'స్పందన' ద్వారా స్వీకరించే అర్జీలకు నాణ్యమైన పరిష్కారం అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి డిఆర్‌ఒ హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులకు అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు పూలే సర్కిల్‌లో ఆందోళన : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో కొన్ని రోజులుగా వివిధ రంగాల కార్మికులు చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా ఈనెల 2న పాత బస్టాండ్‌లో ఉన్న పూలే సర్కిల్‌లో ఆందోళన నిర్వహించనున్నట్లు సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్, కమిటీ సభ్యులు జమీలా, మహబూబ్ తార, శంషాద్ తెలిపారు. సోమవారం సిపిఎం కార్యాలయంలో పార్టీ నగర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి గతంలో అంగన్వాడీ కార్యకర్తలు, మున్సిపల్ , తదితర రంగాల ఉద్యోగులు, కార్మికులకు ఇచ్చిన హామీ నెరవేర్చేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కారం చేసి పోరాటాలను విరమింప జేయకుండా నిర్బంధం, బెదిరింపుల ద్వారా, కార్మికుల మధ్య ఐక్యతను విచ్ఛిన్నం చేయడం కోసం ప్రయత్నం చేస్తోందన్నారు. ఈ పద్ధతుల ద్వారా కార్మికుల పోరాటాలను నిర్వీర్యం చేయడం సాధ్యం కాదని తెలిపారు. కార్మికులు గొంతెమ్మ కోరికలు కోరలేదని, పరిష్కారానికి అవకాశం వున్న సమస్యలు మాత్రమే అన్నారు. జిల్లాలో కార్మికుల ఐక్యతను చీల్చే ప్రయత్నం అధికార పార్టీ నేతలు తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. కార్మికవర్గ పోరాటాలకు సంఘీభావంగా ఆందోళనను జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్


సరుకులను పంపిణీ చేస్తున్న నాయకులు

కార్మికుల రుణం తీర్చుకోలేనిది

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు.. ఇంతటి మహాభాగ్యాన్ని మనకు అందించేందుకు మన ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచే కార్మికుల రుణం తీర్చుకోలేనిదని 33వ వార్డు కౌన్సిలర్ శివజ్యోతి అన్నారు. నూతన సంవత్సర శుభాకాంక్షలతో 33వ వార్డు పారిశుధ్య కార్మికులకు ప్రతి సంవత్సరరంలాగే ఈ ఏడాది కూడా సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కేక్ కట్ చేసి సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల ఉద్యోగం చిన్నదైనా పెద్దమనసుతో చేసే ఈ ఉద్యోగం ఎంతో గొప్పదని కొనియాడారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. వార్డు పెద్దలు కోనేటి ప్రసాదరెడ్డి, అచ్చు కట్ల హుశేన్ సాహెబ్, మైనారిటీ నాయకులు పాలగిరి బాబ, అబ్దుల్‌కలాం, షఫీ, అన్వర్ బాషా, ఖాదర్‌వలి, లడ్డు మస్తాన్, బిసి నేతలు లక్ష్మినారాయణ, బెల్లాల వాసు, బెల్లాల కొండయ్య, యువనాయకులు జహీరుద్దీన్, రెహెమాన్ పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్



నృత్య ప్రదర్శనలో చిన్నారులు

పట్టణంలోని శిల్పారామంలో మహేష్ ఎస్‌కే డ్యాన్స్ ఫిల్మ్ స్టుడియో మాస్టర్ శర్వన్, మనూస్ డ్యాన్స్ అకాడమీ, కదిరి మాష్టర్ మనోహర్ వారి చిన్నారులచే జానపద, సినీ పాటలకు ప్రదర్శించిన నృ త్యాలు ప్రేక్షకులను అల రించాయి. నూతన సంవ త్సరం సందర్భంగా సోమవారం సాయంత్రం చిన్నారులు నృత్యాలు ప్రదర్శిం చారు. కార్యక్రమంలో శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ పాల్గొన్నారు.

పలు కుటుంబాలు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలోని మంగపట్నం గ్రామంలో సోమవారం జమ్మలమడుగు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి భూపేష్ సుబ్బారామిరెడ్డి సమక్షంలో పలు కుటుంబాలు పార్టీలో చేరాయి. బొడెద్దుల వెంకట్రామిరెడ్డి, రామ కృష్ణారెడ్డి, సంజీవరెడ్డి, లక్ష్మి నారాయణరెడ్డి పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి భూపేష్‌రెడ్డి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పార్టీలో చేరినవారితో భూపేష్‌రెడ్డి

'కడియాల' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల పట్టణ బలిజ సంఘం నాయకుడు, వైసిపి నేత కడియాల లక్ష్మినారాయణ జన్మదిన వేడుకలను సోమ వారం గెస్ట్‌హౌస్‌లో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు లక్ష్మీ నారాయణకు పూలు బొకే, శాలువాతో సన్మానించారు. బలిజ సంఘం యూత్ సభ్యులు కార్తీక్, లక్ష్మినారాయణతో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉన్నారు.


లక్ష్మీనారాయణకు కేక్ తినిపిస్తున్న యూత్ సభ్యులు

భక్తులతో కిక్కిరిసిన ఎద్దుల కొండ

వేంపల్లె : స్థానిక పాపాఘ్ని నది అవతలి వైపు ఉన్న ఎద్దుల కొండ సోమవారం భక్తులతో కిక్కిరిసింది. నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం శ్రీవృషభాచలేశ్వర స్వామి దేవస్థాన ఎద్దుల కొండపై ప్రత్యేకపూజలు చేశారు. శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణమహోత్సవం నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు విచ్చేయడంతో దాతలు అన్నదానం కార్యక్రమం చేపట్టారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం చైర్మన్ కుర్రాకుల వెంకటేష్ ఏర్పాట్లు చేశారు. సిఐ చాంద్‌బాషా ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. దేవస్థానం అధికారులు, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ బుట్టలు పంపిణీ

ప్రజాశక్తి - ముద్దనూరు

నూతన సంవత్సరం సందర్భంగా మండల నాయకులు కటికరెడ్డి మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో ఆయన కుమారుడు యువనాయకులు కటికరెడ్డి గుణవంత్‌రెడ్డి కానుకగా ఆదివారం 600 కుటుం బాలకు ప్లాస్టిక్ బుట్టలు పంపిణీ చేశారు. స్థానిక ఎల్‌ఎమ్ కాంపౌండ్, ఎస్వీ గిరి కాలనీలోని ప్రజలకు మండల కేంద్రంలోని సిఎస్ఐ, సిఎస్ఐ (ఎస్పీజీ), ఆర్‌సిఎం, హెబ్రోను, మన్నా మొదలైన చర్చిలలో ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ ప్లాస్టిక్ బుట్టలు పంపిణీ చేశారు. మధుసూదనరెడ్డి, గుణవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మండల ప్రజలకు గిఫ్ట్ పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. క్రిస్మస్, సంక్రాంతి, రంజాన్ పండుగలకు ప్రజలకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బరాయుడు, గఫూర్, వెంకటాద్రి, దానం, ఓబులేసు, కిరణ్ పాల్గొన్నారు.



ప్లాస్టిక్ బుట్టలు అందజేస్తున్న గుణవంత్‌రెడ్డి

క్రైం కార్నర్

రెండు బైక్‌లు ఢీ : ఒకరు మృతి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని కోడూరు గ్రామం వద్ద ఆదివారం అర్ధరాత్రి సమయంలో రెండు బైకులు ఢీకొన్న ఘటనలో గంగాధర్‌రెడ్డి (35) మృతి చెందాడు. పోలీసు తెలిపిన వివరాల మేరకు.. గంగాధర్‌రెడ్డి అతని స్నేహితుడు భరత్‌రెడ్డి కలిసి బైక్‌లో కోడూరు గ్రామం వైపు వెళుతుండగా ఎర్రగుంట్ల వైపు నుండి వస్తున్న మరో బైకు ఎదురుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో గంగాధర్‌రెడ్డి, భరత్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ గంగాధర్‌రెడ్డి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం భరత్‌రెడ్డిని కర్నూలు ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. విషయం తెలియడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.


గంగాధర్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

అంగన్వాడీ కేంద్రాలు వెలవెల

అరకొరగా కేంద్రాలను తెరిచిన అధికారులు - కేంద్రాలకు రాని చిన్నారులు - గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందని పౌష్టికాహారం

ప్రజాశక్తి - చాపాడు

జిల్లా వ్యాప్తంగా 3వేలకు పైగా అంగన్వాడీ పాఠశాలల కార్యకర్తలు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మెలోకి వెళ్లిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో అంగన్వాడీ కేంద్రాలు మూతపడ్డాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలను తూతూ మంత్రంగా తెరిచే ప్రయత్నం సచివాలయ ఉద్యోగులు చేసినా పిల్లలు, గర్భిణులు, బాలింతలు కేంద్రాలకు రాకపోవడంతో అవి వెలవెలబోతున్నాయి. ఈ పరిస్థితుల్లో సచివాలయ సిబ్బంది అంగన్‌వాడీ కేంద్రాలను తెరవడం పూర్తిగా మానుకున్నారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందడం లేదు. బాలింతలకు మాత్రం పౌష్టికాహార బ్యాగ్‌లను సిబ్బంది పంపిణీ చేసి చేతులు దులుపుకున్నారు. 0-5 సంవత్సరాల పిల్లలకు పౌష్టికాహారం అందించే ప్రక్రియ కనిపించకుండా పోయింది. పాఠశాలకు ప్రతిరోజూ వెళుతూ క్రమశిక్షణతో అక్షరాలు దిద్దుకునే పిల్లలు ఇంటికే పరిమితమయ్యారు. కొంతమంది తల్లిదండ్రులు ప్రయివేటు పాఠశాలలకు పంపుతున్నారు. చాలా మండలాల్లో అంగన్వాడీ కార్యకర్తలకే తమ మద్దతు అంటూ గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లిదండ్రులు నిరసనల్లో పాల్గొంటున్నారు. జిల్లాలో కడప, కడప రూరల్, బద్వేలు, పోరుమామిళ్ల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ప్రొద్దుటూరు అర్బన్, ముద్దనూరు, కమలాపురం, మైదుకూరు, చాపాడు, వేంపల్లె, పులివెందులలో అంగన్వాడీ ప్రాజెక్టుల కింద 3వేలకు పైగా అంగన్వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. అంగన్వాడీ కార్యకర్తల సమ్మెతో ఆయా ప్రాజెక్టులకు పూర్తిగా సమాచారం నిలిచిపోయింది. అంగన్వాడీ సూపర్‌వైజర్లు, సిడిపిఒలు కార్యాలయాలకు పరిమితం కావాల్సి వస్తోంది. ఎంపిడిఒల ఆధ్వర్యంలో అధికారులు తాళాలు పగులగొట్టి తెరిచినప్పటికీ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడంలో విఫలమవుతున్నారు. సచివాలయ ఉద్యోగులు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొంటూ.. అంగన్వాడీ కేంద్రాల వైపు చూడడం మానుకున్నారు. తమకు కేటాయించిన పనులతోనే ఉదయం నుంచి సాయంత్రం వరకూ సరిపోతుందని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ తమతో కాదని చేతులెత్తేసినట్లు సమాచారం. ప్రభుత్వం స్పందించి కార్యకర్తల సమస్యలను పరిష్కరించకపోవడం వల్ల 21రోజులుగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందక ఇబ్బందులు పడుతున్నారు. అలాగే అంగన్వాడీలు సమ్మెలోకి వెళ్లే ముందు రోజు వరకూ కేంద్రాల్లో నిల్వ ఉన్న సరుకులు కూడా పాడైపోయిన పరిస్థితి ఏర్పడింది.

ఆయాలకు అలవాటు పడ్డ పిల్లలు

వాస్తవానికి ప్రతిరోజు అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ఉన్న పిల్లలను ఆ కేంద్రానికి సంబంధించిన ఆయా ఇంటింటికి వెళ్లి కేంద్రానికి తీసుకొచ్చే అలవాటు పిల్లలకు ఏర్పడింది. అయితే అధికారులు కేంద్రాలను తెరిచినప్పటికీ ఇంటింటికీ వెళ్లి పిల్లలను తీసుకురావడంలో విఫలమవుతున్నారు. పైగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలతో పిల్లలకు ఉన్న ముఖ పరిచయం సచివాలయ ఉద్యోగులతో లేకపోవడంతో కేంద్రాలకు వెళ్లేందుకు నిరాకరిస్తున్నారు. దీంతో ఉద్యోగులు కూడా నిరాశ చెంది వెనుదిరుగుతున్నారు. కొంతమంది ఉద్యోగులకు ప్రభుత్వం ఆదేశించినప్పటికీ పిల్లలు, గర్భిణులు, బాలింతులు రావడంలేదని తాళాలు పగలగొట్టిన కేంద్రాలను కూడా ప్రస్తుతం తెరవడంలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీ సిబ్బంది సమస్యలను పరిష్కరించి, వారిచే కార్యాలయాలు తెరిచేలా చర్యలు తీసుకుంటేనే అంగన్వాడీ కేంద్రాలకు పూర్వ వైభవం వస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కార్యకర్తలు, ఆయాలు తెరిస్తేనే కేంద్రాలకు వెళతామని అప్పటి వరకూ కేంద్రాల వైపు కన్నెత్తి కూడా చూసేదిలేదని బాలింతులు, గర్భిణులు, చిన్నారులు తెగేసి చెబుతున్నారు.



చాపాడు మండలం సిద్ధారెడ్డిపల్లెలో అంగన్‌వాడీ తెరవకపోవడంతో బయటే ఉన్న పిల్లలు

ప్రభుత్వ పాఠశాలలపై ప్రభావం..

అంగన్వాడీ పాఠశాలు చాలావరకు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల అనుబంధంగా ఉన్నాయి. అంగన్వాడీ పాఠశాలలు మూతపడడం పిల్లలు ఇంటి వద్దనే ఉంఉటున్నారు. ఒకటి రెండవ తరగతి విద్యార్థులు కూడా పాఠశాలలకు వెళ్లకుండా మొండికేస్తున్నారు. ఎక్కువగా ఒకే ఇంటిలో ఉండే పిల్లల్లో ఇలా జరుగుతోంది. వారికి ఆట, పాటల్లేవు. వచ్చిన కొద్దిపాటి రైమ్స్, అక్షరమాల పూర్తిగా మరిచిపోతున్నారు. దీంతో కొంతమంది తల్లిదండ్రులు నాలుగేళ్ల వయసుగల వారిని ప్రయివేట్ పాఠశాలలు, పట్టణాలకు బస్సుల్లో పంపుతున్నారు. ఇలాంటి పిల్లలు రాబోయే రోజుల్లో మళ్లీ అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పరిస్థితి ఉంటుందానేది అనుమానమే. ఈ ప్రభావంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటవ తరగతిలో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ఈ ప్రభావం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలపై కనిపిస్తుందని పలువురు పేర్కొంటున్నారు.

పిల్లల్లో క్రమశిక్షణ దెబ్బతింది



అంగన్వాడీ కార్యకర్తలు సమ్మెలో ఉండడంతో ప్రతి రోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు వెళ్లే పాప ఇంటికి పరిమితమైంది. అంగన్వాడీ పాఠశాలకు వెళ్లే సందర్భంలో చదువుకున్న అంశాలు పూర్తిగా మరిచిపోతోంది. పౌష్టికాహారం అందించడం లేదు. ప్రభుత్వ పాఠశాలలోకి చిన్నపిల్లలను అనుమతించడం లేదు. పట్టణాలకు బస్సుల్లో పంపాలంటే పాప వెళ్లడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంగన్వాడీ కేంద్రాలను తెరిపించాలి.

- ఐశ్వర్య, అంగన్వాడీ విద్యార్థి తల్లి. సిద్ధారెడ్డిపల్లె

ప్రయివేటు పాఠశాలకు పంపాల్సి వస్తోంది



గతంలో పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపుతున్నాం. అంగన్వాడీ కార్యకర్తలు సమ్మె ప్రారంభించడంతో వారం రోజులపాటు వేచి చూశాం. 18 రోజులైనా పాఠశాలలు తెరవకపోవడంతో పిల్లలను ప్రొద్దుటూరు ప్రయివేట్ పాఠశాల నర్సరీకి పంపించాల్సి వస్తోంది. ఆర్థికంగా ఇబ్బంది అయినప్పటికీ తప్పడం లేదు. పేదలకు అంగన్వాడీ కేంద్రాల మూతతో ఆర్థిక నష్టాలు తప్పడం లేదు.

- అనసూయ, విద్యార్థి తల్లి, చాపాడు

మెనూ ప్రకారం పౌష్టికాహారం అందడం లేదు



అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మెలోకి వెళ్లిన తర్వాత అధికారులు హడావుడిగా కేంద్రాలను తెరిచారు. తెరిచిన వారానికి సరుకుల కిట్టు అందజేశారు. గతంలో అంగన్వాడీ కేంద్రాలకు క్రమం తప్పకుండా వెళుతూ సమయానికి పౌష్టికాహారం మెనూ ప్రకారం తీసుకునే అవకాశం ఉండేది. ప్రస్తుతం చిన్న పాపతో పనులు చేసుకుంటూ వంట చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడినది.

- నసీమూన్, బాలింత తల్లి, చాపాడు

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు


ఎస్‌పిచే కేక్ కట్ చేయిస్తున్న సంఘ సేవకులు సలావుద్దీన్

ప్రజాశక్తి - కడప/ కడప అర్బన్

నూతన సంవత్సర ఉత్సవాలను పురస్కరించుకుని ప్రముఖ సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ ఎస్‌పి సిద్ధార్థ కౌశల్, డిఎస్‌పి, ఆర్‌డిఒ జి.ఆర్. మధుసూదన్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి.సూర్య సాయి ప్రవీణ్ చంద్, పలువురు సిఐలను కలిసి వారిని ఘనంగా సన్మానించి, కేక్ కటింగ్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. **కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..** 2024 వ సంవత్సరం ప్రజల జీవితం ఆనందమయం కావాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు ఆకాంక్షించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరితో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు విష్ణు ప్రీతమ్ రెడ్డి, పిసిసి వైస్ ప్రెసిడెంట్ నజీర్ అహ్మద్, పిసిసి ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సత్తార్, పిసిసి డెలిగేట్ పొట్టిపాటి చంద్రశేఖర్ రెడ్డి, ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి, మల్లెం విజయభాస్కర్, పి.సి.సి.మైనార్టీ సెల్ పఠాన్ మహమ్మద్ అలీఖాన్, కదిరి ప్రసాద్ గౌడ్, ఆరీఫ్, చిన్న కుల్లాయప్ప, సుజాత రెడ్డి, గౌరీ, షేక్ మహమ్మద్ రఫీక్, షేక్ మహమ్మద్ అమాన్, చెన్నకేశవరావు, ఆనంద్ పాల్గొన్నారు. **కెఎస్‌ఆర్ఎం విద్యాసంస్థల్లో ..** గత సంవత్సరానికి వీడ్కోలు తెలుపుతూ సుఖ సంతసాలతో నూతన సంవత్సరం వెల్లి విరియాలి అని కందుల గ్రూప్ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని) ఆకాంక్షించారు. కళాశాల కెఎస్‌ఎన్ ఆర్ ఘాట్ లో కళాశాల కల్చరల్ విభాగం వారు ఏర్పాటు చేసిన నూతన సంవత్సర వేడుక కార్యక్రమంలో భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్,కోశాధికారి కందుల రాజేశ్వరమ్మ, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని), ప్రిన్సిపల్ డాక్టర్ వీ ఎస్ ఎస్ మూర్తి, కెఎల్ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఎం వి రత్నమ్మ, కెఎస్‌ఆర్ఎం కళాశాల మేనేజ్మెంట్ స్టడీస్ ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణ మోహన్, అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ ప్రేమ్ కుమార్, వివిధ విభాగాధిపతులు, డీన్లు, కార్యక్రమ సమన్వయ కర్త డాక్టర్ బి.వీర శంకర్, సిబ్బంది విద్యార్ధిని, విద్యార్థులు పాల్గొన్నారు. **న్యూ నేటీవ్ కృపా చర్చిలో..** కడప నగరం 48 డివిజన్ కృపా కృపా కాలనీ నందు న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ ఆధ్వర్యంలో న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 48 డివిజన్ ఇన్‌ఛార్జి బంగారు నాగయ్య, మార్కెట్ యార్డ్ చైర్మన్ బి. గంగా దేవి, స్థానిక నాయకులు కే. క్రిష్ణ స్వామి, ఖాజా హుసేన్ హజరుకాగ, ప్రార్థనల అనంతరం కేక్ కట్ చేసి పారిశుధ్య కార్మికులకు, వలస కూలీలకు వస్త్రాలు పంపిణీ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో యస్.విమల, పి.రవితేజ, గోకారి, అశోక్, వెంకటేష్, శాంతిరాజు, రాముడు, శివమ్మ, రోజా, నందిని, బాగ్యమ్మ, మాదేవి, జాన్, నరసయ్య, అంజలి పాల్గొన్నారు. **పంచాయతీరాజ్ కేలండర్ ఆవిష్కరణ..** జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం, జిల్లా శాఖ, వై యస్ అర్ జిల్లా నూతన కేలండర్‌ను జడ్‌పి సిఇఒ సుధాకర్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఆయనతోపాటు ఆర్. నాగిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, లంకా మల్లేశ్వర రెడ్డి, జిల్లా అధ్యక్షులు, రంగచార్యులు, ఎఒ, అన్ని విభాగాలకు సంబంధించిన ఎఒలు, సి. శ్రీనివాస రెడ్డి పరిషత్ యూనిట్ అధ్యక్షులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. **బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..** బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తుల లింగమూర్తి, గౌరవ సలహాదారు ఏ వి ఆర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నగరంలోని పాత రిమ్స్ లో ఉన్న బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ముందుగా సంఘం నాయకులు ప్రజా ప్రతినిధులు డిప్యూటీ సీఎం అంజాద్‌బాషాను, జిల్లా అధికారులను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, ప్రధాన కార్యదర్శి త్రివిక్రమ్, యువ నాయకులు సిఆర్‌ఐ సునీల్ నాయకులు సీనియర్ నాయకులు ఖాదర్ బాషా మునిరత్నం గౌడ్,కల్యా సుధాకర్, శ్రీనివాసులు నారాయణ చేలో రవి ఓబులేసు బాబయ్య, సింహం నంద్యాల సుబ్బరాయుడు మహిళలు నారాయణమ్మ పాల్గొన్నారు **చాపాడు :**మండల పరిధిలో సోమవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది ఉన్నతాధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. కేకు కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి టి.లక్ష్మయ్య, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడును సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలు తహసీల్దార్ యామినికి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లో సర్పంచ్, ఎంపీటీసీలను సచివాలయ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అల్లాడుపల్లె వీరభద్రస్వామి, విశ్వనాధపురం ఆంజనేయస్వామిని ప్రజలు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో జయరామిరెడ్డి, రమణయ్య, ప్రసాద్, నారాయణరెడ్డి, కిశోర్ కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షల వెల్లువ

మైదుకూరు శాసనసభ్యులు శెట్టిపల్లి రఘురామిరెడ్డికి సోమవారం ఉదయం నియోజకవర్గ పరిధిలోని అధికారులు, ప్రజాప్రతినిధులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. చాపాడు, మైదుకూరు, దువ్వూరు, బ్రహ్మంగారిమఠం, ఖాజీపేట మండలాల ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, ప్రజలు ఎమ్మెల్యేను కలిసి శాలువా, పూలమాలలు, బొకేలు, పండ్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మైదుకూరు డివిజనల్ పోలీసు అధికారులు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. డివిజనల్ పరిధిలోని పోలీస్‌సిబ్బంది, ఎస్ఐలు, అధికారులు, నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి, చాపాడు ఎంపీపీ టి.లక్ష్మమయ్య, వైసిపి నాయకులు జయరామిరెడ్డి, పివి రమణారెడ్డి, నారాయణరెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, జయసుబ్బారెడ్డి, మైదుకూరు ఆర్యవైశ్య సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **పులివెందుల టౌన్ :** పులివెందుల పట్టణంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డికి అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు భారీగా తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి కార్యాలయంలో పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్యనేతల నివాసాల్లో వారి అనుచరులతో వేడుకలను నిర్వహించారు. **వేంపల్లె :** వేంపల్లెలో ఆమ్‌ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో 2024 కొత్త ఏడాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ సేవా సమితి అధ్యక్షుడు బందెల రామాంజనేయులు, ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లాలు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డిని, వైసిపి మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డిని, పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డిని, టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డిని, మాజీ ఎమ్మెల్సీ సతీష్‌రెడ్డిని ఆయా పార్టీల నాయకులు కలిసి ఘనంగా పూలమాలలుతో సత్కరించారు. **జమ్మలమడుగు రూరల్ :** తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడానికి అభిమానులు పోటెత్తారు. సోమవారం ఉదయం మొదట భూపేష్ రెడ్డి స్థానిక మూడు రోడ్ల కూడలిలో ఉన్న మాజీ ఎమ్మెల్యే కుండా రామయ్య జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి బిసిలపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో తన అభిమానులతో, టిడిపి కార్యకర్తలతో కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నియోజవర్గంలోని కార్యకర్తలు పాల్గొన్నారు. **ముద్దనూరు :** నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం మండలంలోని అన్ని చర్చిలలో క్రైస్తవులు వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎల్‌ఎమ్ కాంపౌండ్‌లోని సిఎస్ఐ చర్చిలో రెవరెండ్ పాస్టర్ దేవసహాయం, నాలుగు రోడ్ల రహదారిలోని సిఎస్ఐ (ఎస్పీజీ) చర్చిలో రెవరెండ్ పాస్టర్ సంతోష్ బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కేక్ కట్ చేశారు. చెస్, క్రికెట్, కబడ్డీ, లాంగ్ జంప్, రన్నింగ్, మ్యూజికల్ ఛైర్స్ మొదలైన ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు జమ్మలమడుగు క్యాంబెల్ హస్పిటల్ ప్రముఖ వైద్యులు అగస్టీన్ రాజు, ముద్దనూరు సిఐ నరేష్ బాబు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సరళ, ఎంపిటిసి ఇంద్రాణి, సంఘ పెద్దలు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** ప్రొద్దుటూరు నియోజకవర్గ యువనేత, సేవా తత్పరుడు భూమిరెడ్డి సూర్యప్రతాపరెడ్డి తన అభిమానుల మధ్య సోమవారం తన కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో భూమిరెడ్డి సూర్య సైన్యం పాల్గొంది.


చాపాడు : ఎమ్మెల్యేను సన్మానిస్తున్న చియ్యపాడు ప్రజలు


వేంపల్లె : జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న మైనార్టీ నాయకులు

కార్మికుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

తమ న్యాయమైక కోర్కెల సరిష్కారం కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా 21రోజులుగా అంగన్వాడీలు, 7రోజులుగా మున్సిపల్ వర్కర్లు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమని సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులరెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. వీరి అందోళనలకు అనేక ప్రజాసంఘాలు మద్దతు తెలుపుతున్నాయన్నారు. ప్రజాసంఘాల మద్దతును రాజకీయ కోణంలో చూడొద్దని కోరారు. ప్రొద్దుటూరు మున్సిపపాల్టీలోని క్లాప్ డ్రైవర్లకు 6నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే అధికార పార్టీకి చెందిన పాలకవర్గం ఏమైందని ప్రశ్నించారు. ఆ కాంట్రాక్టర్‌ను ఎందుకు బ్లాక్‌లిస్ట్‌లో పెట్టలేదని ప్రశ్నించారు. ఈ విషయాన్ని అనేక దఫాలుగా కమిషనర్, కార్మికశాఖ దృష్టికి తీసుకుపోయామన్నారు. ఇప్పుడు జోక్యం చేసుకున్నారు కాబట్టి నాలుగు నెలల వేతనాలు అందాయన్నారు. కోవిడ్ 2020లో 94 మందిని ఉద్యోగంలోకి తీసుకుంటే వారికి ఇంతవరకు వేతనాలు పెంచలేదన్నారు. ఆరోజు ప్రొద్దుటూరు ఎమ్మెల్యే ప్రతినెల రూ.3000 వేతనం పెంచి ఇస్తామన్నా నేటికి అమలు కాలేదన్నారు. ప్రస్తుతం కార్మికుల వేతనాలు పెరిగేంత వరకు ప్రతినెల రూ.3000 ఇస్తామని చెప్పే విషయం మంచిదైనప్పటికీ ఈ విషయాన్ని రాష్ట్రంలోని మిగతా ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోతే సమస్య రాష్ట్ర వ్యాప్తంగా పరిష్కారమవుతుందన్నారు. అలా కాకుండా ఉద్యోగులను భయభ్రాంతులను చేయడం, ఉద్యమాన్ని విచ్చిన్నం చేయడం కోసం ఇలాంటి ప్రయోగాలు మంచిది కాదన్నారు. సమావేశంలో మహిళా నాయకులు ముంతాజ్‌బేగం, వెంకటసుబ్బమ్మ, రాములమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కామనూరు శ్రీనివాసులురెడ్డి

పార్కుల్లో సందడి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండల కేంద్రమైన సింహాద్రిపురంలో నూతనంగా నిర్మించిన పార్కు సోమవారం ప్రజలతో కళకళలాడింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గత నెల 25న వైయస్సార్ మెమోరియల్ పార్కును ప్రారంభించిన విషయం విదితమే. అయితే పార్కులో పెండింగ్ పనుల కారణంగా ప్రజలను సోమవారం నుంచి అనుమతించారు. దాదాపు రూ.4 కోట్ల వ్యయంతో అధునాతన ఊయల, చిన్నపిల్లలు ఆడుకోవడానికి అవసరమైన వాటిని అమర్చారు. వివిధ ప్రాంతాల నుంచి తెచ్చిన మొక్కలు, గడ్డితో పార్కులో పచ్చదనం పరుచుకుంది.



సందర్శకుల సందడితో వైఎస్ఆర్ మెమోరియల్ పార్కు